విలువలు

"పెద్దరికం"

పోర్టికోలో నిలబడి క్రింది గార్డెన్‌లోకి చూస్తున్న మధు చూపులు గేటు ధాటుకొని వస్తున్న తండ్రి కారుపై ప్రసరించాయి. డోరు తీసుకొని క్రిందకు దిగిన రావుగారు సరాసరి ఇంట్లోకి వెళ్ళకుండ గార్డెన్‌లోకి అడుగుపెట్టి మెల్లగా పచార్లు చేయసాగారు. అస్తమయ సూర్యుని అరుణ వర్ణపు కాంతిలో తోటలోని ప్రతి మొక్క చిత్రమైన అందాన్ని సంతరించుకొంటు మెల్లగా వీచే గాలికి తలలూపుతూ రావుగారికి ఆహ్వానం పలుకుతున్నాయి. ఒక ప్రక్కగా వున్న తెల్లగులాబీ మొక్క దగ్గరగా తండ్రి నిలబడి తదేక ధ్యానంతో చూస్తుండటం మధుకు కనిపించింది.

• తండ్రిని చూస్తున్న మధులో తాత్కాలికంగా మర్చిపోయిన బాధ తిరిగి చిన్నగా రేగటం మొదలెట్టింది. తనకే తెలియని ఏదో ఆందోళన, ఆరాటం మధుని అనిశ్చితమైన పరిస్థితిలోనికి నెడుతున్నాయి. చిన్నతనంనుండి తండ్రి పట్ల ఏర్పరచుకొన్న గౌరవ భావానికి భంగం ఏర్పడితే తట్టుకోలేనట్లుగ తండ్రిని చూస్తున్న మధు చూపుల్లో ఒక విధమైన బేలతనం అసహాయత కొట్టవచ్చినట్లుగ కనిపిస్తున్నాయి. తన అంతరంగంలో తండ్రిని గురించి ఇలా అగౌరవంగా తలపోయటానికి మధులో సంస్కారం అడ్డు పడుతున్నది. అయితే తను ప్రత్యక్షంగా చూచిన





విలువలు

దృశ్యం కళ్ళముందు మరువురాకుండా గిర్రున తిరుగుతున్నది. చాలా రోజులుగా తనలో వున్న సందేహానికి ఆ సంఘటన బలాన్ని చేకూర్చింది. తండ్రి ప్రవర్తన పట్ల తనకు కలిగిన సందేహానికి తప్పు చేసినట్లుగ బాధకు గురియవుతున్న మధు నిన్నటి సంఘటనతో తండ్రి ప్రవర్తనను ఏ విధంగా బేరీజు వేయాలో తెలియక సతమతమవుతున్నాడు. మనసులో తండ్రిని శంకించవలసిన దుఃస్థితి కలిగినందుకు మధుకి తన సంస్కారం పట్ల నమ్మకం సడల జొచ్చింది. తన దృష్టిలో తండ్రి. ఒక మహోన్నతమైన వ్యక్తిత్వం గల మనిషి. చిన్న తనం నుండి మనసులో తండ్రి పట్ల ఏర్పరుచుకొన్న భావాన్ని ఎట్టి పరిస్థితి లోనూ తొలిక పరచుకోవటం తనవల్లకాదు. తన అంతరంగంలో రూపుదిద్దుకొన్న తండ్రి వ్యక్తిత్వం పట్ల తనకు నమ్మకం వుంది. మరయితే తండ్రి ప్రవర్తనపట్ల తనకు రెండు రోజులుగా ఇంతటి ఆందోళన ఎందుకు కలుగుతున్నదీ మధుకి అర్థం కావటం లేదు. విజ్ఞాన్ని తండ్రిని అడిగి తెలుసుకొనే చొరవ, తమ ఇద్దరి మధ్య అటువంటి స్నేహ పూర్వక అనుబంధం వున్నాగాని తండ్రి వ్యక్తి గత విషయాల్లో తలదూర్చటం ఎంతవరకు సమంజసమా? అన్న శంక మనసుని పట్టి పీడిస్తున్నది. చూచిన విషయాన్ని మర్చిపోవటం తండ్రి పట్ల పూర్వం వలె ప్రవర్తించటం కూడా సాధ్యం కావటం లేదు.

మొన్నటి రోజు రాధతో కలసి బీచికి వెళ్ళిన మధు కొద్ది దూరంలో సముద్రానికి అభిముఖంగా కూర్చున్న ఒక నడి వయస్సు స్త్రీ పురుషులలో పురుషుడిని తన తండ్రిగా గుర్తు పట్టాడు. వెనుక భాగంలో వున్న ఆ స్త్రీని పరికించి చూచే అవకాశం మధుకి కలగలేదు. చాలా రోజులుగా తండ్రిని గురించి తాను అక్కడక్కడ వింటున్న మాటలకు ఈ సంఘటనతో ఆదారం లభించినట్లయినది.

ఒక ప్రొఫెసర్‌గా, సంఘంలో గౌరవ ప్రతిష్టలు గలవాడు, విద్యారికుడు అయిన తన తండ్రి ఈ విధంగా ప్రవర్తించటానికి ఏదో బలీయమైన అంతరింగిక కారణం వుండి వుంటుంది. లేకుంటే తండ్రి మంచి చెడ్డలు తెలియక విచక్షణా రహితంగా ప్రవర్తిస్తారంటే మధుకి మనసు అందుకు అంగీకరించటం లేదు.

హఠాత్తుగా మధుకి ఒక విషయం జ్ఞాపకం వచ్చింది. అది వారం రోజులుగా తండ్రికి తాను చెప్పదలుచుకొన్న విషయం. ఈ రెండురోజులుగా తాను పొందుతున్న ఆరాటం వలన మరుగున పడిపోయింది. ఆ విషయం తండ్రితో మాట్లాడుతూ వీలైతే తన సందేహాన్ని కొంతవరకైనా నివృత్తి చేసుకోవచ్చు. అప్పటికిగాని తన మనసు తేలికపడదు. ఆలోచనల నుండి తెప్పరిల్లి మధు గార్డెన్‌లోకి చూచాడు. తండ్రి అక్కడ కనపడలేదు. బహుశా రీడింగ్ రూములో వుండవచ్చు. కాలేజీనుంచి వచ్చి టీ త్రాగి చదువుతూ కూర్చోటం తండ్రికి అలవాటు.

మెట్లుదిగి వస్తున్న మధుకి అప్పుడే కారుదిగి లోపలికి వస్తున్న తల్లి ఎదురైంది.

"హలో మధూ కాలేజీనుంచి వచ్చి ఎంత సేపైంది?" రమాదేవి గొంతులో కొడుకుని తల్లి పలకరించే విధానంకన్నా నేటి నాగరిక లక్షణాలే ఎక్కువగా వ్యక్తమౌతుంటాయి.

పెదవులకు లిప్‌స్టిక్, స్లీవ్‌లెస్, బ్లౌజ్, హైహీల్సు షూస్ మొదలగు అలంకరణతో నేటి నాగరిక సమాజానికి ప్రతిరూపంగా భాసిస్తుంటుంది రమాదేవి రూపం. వయసుకి తగని ఆ అలంకారం మధుకి నచ్చదు. తల్లి దగ్గర చిన్నతనం నుంచీ చనువు ఏర్పడకపోగా ఎదో బెరుగ్గా ఫీలౌతాడు మధూ. తండ్రిపై మధూకి ఎంతటి గౌరవభావముందో తల్లి ప్రవర్తన పట్ల అంతటి విముఖత వుంది. ఇల్లు పట్టకుండా ఇరవైవాల్గుగంటలు క్లబ్బులకు, సినిమాలకు తిరుగుతూ స్నేహితులతో వరదాలు తీర్చుకొనే తల్లినుండి ఒక కొడుకుగా మధు ఏనాడు ఆదరణ, ఆప్యాయతకు నోచుకోలేదు. మధు తమ్ముడు మధాకర్, చెల్లెలు సుజాత మాత్రం తల్లి అదుపుజాడలలోనే నడుస్తుంటారు. మధు స్వభావం చిన్నతనం నుంచీ విశిష్టంగానే వుండేది. మధులో తండ్రి లక్షణాలు, పోలికలు ఎక్కువగా కనిపిస్తాయి. తండ్రికి కొడుకుగా పెరగటమే మధుకి ఇష్టం. అందుకే ఈనాటి విశృంఖలమైన నాగరికతా ఛాయలు మధుపైన ఎటువంటి ప్రభావాన్ని చూపలేకపోయాయి.

రమాదేవి దృష్టిలో మాత్రం తండ్రికొడుకు లిద్దరూ అనాగరికులే. భర్త చూస్తే ఎప్పుడూ పుస్తకాలు చదువుతూ కూర్చోవటం, లేకుంటే బొమ్మలు వేస్తూ కూర్చోటం తప్ప ఇతరత్ర ఏ పరదా లేని మనిషి. కొడుకు చూస్తే జాలీగా రోజులు క్షణాలుగా గడపవలసిన టైమ్‌లో కాలేజి ఇల్లు తప్ప మిగిలిన ప్రపంచం పట్టదు. అందుకే వీళ్ళిద్దరికి దూరంగా తన ఆనందం తాను వెతుక్కుంటుంటుంది రమాదేవి.

తండ్రి రీడింగ్ రూమ్‌లో అడుగుపెట్టిన మధు ఒక్క క్షణం రూమ్‌ని పరికిస్తూ వుండిపోయాడు. వలువైవులా అద్దాలు బిగించబడిన రాక్సు నిండా అమర్చిన పుస్తకాలు ప్రపంచంలోని విజ్ఞాన సంపదనంతా తమలో గుప్తంగా దాచుకొని మౌనంగా గంభీరంగా చూస్తున్నట్లు, పొందికగా పర్చబడియున్నాయి. వాటికి వేసిన రంగురంగుల అట్టలు చిత్రకారుడు గీసిన వర్ణచిత్రాన్ని చూస్తున్నట్లుగా ఒక విధమైన అనుభూతిని కలిగిస్తున్నాయి. ఒకప్రక్క రాక్‌మీద అందంగా అమర్చిన పూలకుండీలోని లిల్లీపూలు సున్నితమైన పరిమళాన్ని గదినిండా వ్యాపింపజేస్తున్నాయి. ఇంకొక వైపుగా వున్న రాక్‌మీద అర్ధనగ్నమైన భంగిమలో వీనస్ శిల్పం ధవళకాంతులు వెదజల్లుతూ హొయలు చిందిస్తూ నిలబడియున్నది. వేరొకవైపున పెదవులపై మెత్తని చిరునవ్వుతో కళ్ళలో వింత కాంతులు కురిపించుతూ ముగ్ధమోహనకరంగా వున్న ముఖ భంగిమతో ఒక అపరిచిత యువతి ఫోటో చీకటి ఫ్రేమ్‌లో బిగించబడివుంది. తన ఎదురుగా లేత నీలిరంగు వేసిన గోడకు తగిలించిన చిత్రపటంలోని దృశ్యాన్ని చూచిన మధు హృదయం ఒక్క క్షణం ఏదో తెలియని రసానుభూతికి లోనై పరవశించింది.

ఆ చిత్రంలో మహోత్సాహంతో ఎగిసిపడుతున్న తెల్లని సముద్ర కెరటాలకు నీలివర్ణాన్ని పులుముతూ వెండిముద్దలా ప్రకాశిస్తున్నాడు చంద్రుడు. ఆ లేత నీలి వెన్నెలలో అస్పష్టంగా కనపించీ కనపించని ఒక మానవాకారం

నిర్నిమేష దృక్కులతో ఆ ప్రకృతిలో పరవశించిపోతూ కడలికి అభిముఖంగా నిలబడి వున్నది. ఆ ఆకారం కాళ్ళకిందగా మెత్తటి తెల్లటి ఇసుక చిత్రించబడి వుంది. ఆ చిత్రంలో ఒక మూలగా 'ఆర్' అనే తన తండ్రి సంతకం వ్రాయబడి వుంది. ఆ చిత్రం చూస్తున్న వారెవరైనా ఒక్క క్షణం ఆ నీలి వెన్నెలలో తాము కూడ సముద్రపుటొడ్డున విహరిస్తున్న అనుభూతికి లోనౌతారు.

తన కుడి చేతి వైపు వున్న తండ్రి కూర్చుని చదువుకొనే టేబుల్ పై మధు దృష్టి ప్రసరించింది. పెన్‌స్టాండ్, లేటర్‌పాడ్, తండ్రి వుపయోగించే గోల్డు ప్రేమ్ కళ్ళజోడు, పేపర్ వెయిట్ క్రిందగా గాలికి రెపరెప కొట్టుకొంటున్న తెల్లని కాయితాలు, టేబుల్ కెదురుగా తండ్రి కూర్చోడానికి రివాల్వింగ్ చైర్ వేసివున్నాయి. గదినంతటిని కలయచూస్తున్న మధు తండ్రి అభిరుచిని మనసులోనే అభినందించాడు.

ఇంతలో తండ్రి వస్తున్నట్లుగా మెత్తని సాండిల్సు చప్పుడు వినిపించటంతో తేరుకొని వచ్చిన పని గుర్తు చేసుకొంటూ నిలబడిపోయాడు. —

మధుని రూములో చూచిన రావుగారి కళ్ళు ప్రశ్నార్థకంగా ముడిపడ్డాయి. ఎంతో అవసరమైతే తప్ప కొడుకు తన రీడింగ్ రూములోకి రాడని రావుగారికి తెలుసు. ఇంట్లో ఎవరు కూడ తను ఈ రూములో వుంటే డిస్టర్బ్ చేయరు. పిల్లలకు కూడ ఆ విధంగా చిన్నతనం నించి తర్ఫీదు ఇవ్వబడింది. గదిలోకి వచ్చిన రావుగారు కళ్ళజోడు పెట్టుకొంటూ వచ్చిన పని చెప్పమన్నట్లుగ కొడుకు కళ్ళలోకి చూచారు.

మధు ముఖంలో ఎదో చెప్పాలనే ఆరాటం, ఎలా చెప్పాలనే సంశయం రావుగారి కళ్ళపడక పోలేదు.

"మధూ! నిలబడి వున్నావే కూర్చో" ఆ కంఠంలో మృదుత్వం, కొడుకు పట్ల ఆత్మీయతా భావం పెనవేసుకొని వున్నాయి.

తండ్రి మూడ్‌ని పసికట్టిన మధులో కొంత ధైర్యంగా సోఫాలో తండ్రికెదురుగా కూర్చుంటూ—

మెల్లగా తన చేతిలోని పుస్తకంలోంచి ఒక కార్డు సైజు ఫొటో తండ్రి చేతిలోపెట్టాడు. ఫొటో చూడగానే పరిస్థితి గ్రహించిన రావుగారు వివరాలు కొడుకు నోటి వెంట వినాలనే కుతూహలంతో,

"ఎవరీ అమ్మాయి ?" అంటూ ప్రశ్నించారు.

"పేరు రాధ. మా కాలేజీలోనే చదువుతోంది. మీరనుమతిస్తే ఈ సంవత్సరం చదువు పూర్తవగానే వివాహం చేసుకోవాలని నిర్ణయించుకొన్నాము."

కొడుకు కంఠంలో ధ్వనించిన భావోద్వేగానికి రావుగారి పెదవులపై చిరునవ్వు విచ్చుకుంది.

"ఎప్పటినుంచీ మీ పరిచయం ?"

"ఒక సంవత్సరకాలంగా రాధ నాకు తెలుసు. రోజు కలుసుకొంటుంటాము" మధు ముఖంలో ఒక లిప్తకాలం ఎరుపు తొంగిచూచి మరుక్షణం మాయమయింది.

"మధూ. నీవు చిన్నవాడివి కాదు. నీ జీవితాన్ని నీవు ఏ విధంగా మలుచుకోవాలో నిర్ణయించుకొనే పాటి వివేకం నీకుందని నా నమ్మకం. నీ మనసుకు వ్యతిరేకంగా నేనెట్టి పరిస్థితిలోను ప్రవర్తించనని నీకు తెలుసు. అది నా అభిమతం కూడ కాదు. అయితే వివాహం అనేది జీవితంలో అతి ముఖ్యమయిన మలుపులాంటిది. ఈ మలుపు దగ్గరే వివేకంతో ప్రవర్తించాలి. లేకుంటే భవిష్యత్ జీవితానికి మన ఆనందాన్ని, సంతోషాన్ని బలిచేసి జీవించినన్నాళ్ళు వేదనతోనే రోజులు గడపవలసి వస్తుంది."

తండ్రి చెబుతున్నది కాదనలేనట్లుగా మధు మెల్లగా తల వూపాడు.

"మధూ! యవ్వనంలో వున్న నీ కళ్ళకు పరిసరాలన్నీ ఆనందమయంగానే కనపడుతుంటాయి. అట్లాగే అందమయిన స్త్రీని చూస్తే నీ హృదయం లయతప్పి నీ వివేకం మరుగునపడి ఆ ఆనందాన్ని ఆస్వాదించాలనే కోరిక కలగటం నీ వయసులో సహజం. స్త్రీ పురుషుల మధ్య వుండే ఆకర్షణ బలీయమైనది. ఒక్కసారి ఆ ఆకర్షణకు లోనై వివేక సూన్యంగా జీవితం పట్ల నిర్ణయం తీసుకొన్నామంటె చివరకు మన అస్థిత్వాన్నే పోగొట్టుకొంటాము."

"కానీ నాన్నగారూ!"

తండ్రి ధోరణికి అడ్డుపడుతున్నట్లుగ అన్నాడు మధు. చెప్పటం ఆపి ఇక చెప్పవలసింది కొడుకు వంతే అన్నట్లుగ మధు కళ్ళలోకి చూస్తుండిపోయారు రావుగారు.

"నాన్నగారూ! ఇది కేవలం ఆకర్షణతో తీసుకొన్న నిర్ణయం కాదు. రాధతో సహచర్యాన్ని నా మనసు కోరుకొంటున్నది. ఒక్క రోజు రాధను చూడకపోతే ఏదో పోగొట్టుకొన్నట్లుగ నా మనసుకు తెలుస్తున్నది. రాధ అందమైనదే కావచ్చు నాకు కావలసింది రాధ తప్ప రాధ అందం కాదు." నన్ను అర్థం చేసుకోండి అన్నట్లుగా తగ్గు స్వరంతో తండ్రికి తన బాధ విప్పి చెప్పటానికి ప్రయత్నిస్తూ అన్నాడు మధు.

కొడుకు కళ్ళలో ప్రతిఫలిస్తున్న భావం రావుగారికి అర్థం అయింది. చిన్న తనం నుంచీ కొడుకు స్వభావం తెలిసి వుండటంతో ఆలోచించే ఈ నిర్ణయం తీసుకొన్నట్లుగ నమ్మకం కలిగింది. కానీ తన మనసు పొరల్లో గుప్తమై పోయిన ఏదో వేదన కొడుకుకి త్వరగా అనుమతి ఇవ్వటానికి అంగీకరింపచేయటం లేదు. కొన్ని నిముషాలు మౌనంగా వుండిపోయిన తండ్రి ముఖంలో ఏదో బాధ పొడ చూపి వెళ్ళగా మధు హృదయం గిలగిల లాడింది. తండ్రిని ఆ పరిస్థితిలో ఎన్నడూ చూడని మధు కొంత ఆశ్చర్యానికి లోనైయ్యాడు.

"నాన్నగారు ఏమిటలా అయిపోయారు ?" మధు కంఠంలో ఆతృత, ఆరాటం.

కొడుకు ప్రశ్న వినిపించిందో లేదో గాని రావుగారు మాత్రం దాదాపు శూన్యమైన దృక్కులతో టేబులు పైన వున్న ఫోటోవైపు చూపులు బరిపి మౌనంగా కూర్చుడి పోయారు.

"మధూ! వైవాహిక జీవితంలో అనాలోచితంగా తీసుకొన్న నిర్ణయాలకు జీవితాన్నే పోగొట్టుకొంటాము. ఉదాహరణకు నా జీవితంలో కొన్ని ముఖ్యమైన విషయాలను చెబుతాయి. నీవు పెద్దవాడివయ్యావు. జీవితం పట్ల పరియైన దృక్పథం ఏర్పరచుకోవలసిన అవసరం ఎంతటిదో నీవు నా జీవితం గురించి విని నిర్ణయించుకొంటే సంతోషిస్తాను." కళ్ళు మూసుకొని కుర్చీలో వెనక్కు వాలి గంభీర స్వరంతో మెల్లగా చెబుతున్న తండ్రి మాటలు శ్రద్ధగా, కుతూహలంతో వినసాగాడు మధు.

"మీ తాతగారు సాంప్రదాయబద్ధంగా జీవించే వ్యక్తి. చాలా పట్టుదలగలవారు. చాలా చిన్నతనంలోనే ఇంట్లో పరిస్థితులు నా మనసుకు నచ్చక వారితో ఘర్షణకు దిగలేక నాదనుకొనే ఒక ప్రపంచాన్ని ఏర్పరచుకొని సమయమంతా అందులోనే గడిపేవాడిని. అప్పుడే చదువుతోపాటుగా సాహిత్య





'కార్టూనిస్టులకు సూచనలు!'

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి

★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలా బిళ్లలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకు పదారువారాలు పట్టవచ్చు.

★ నిండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతో కించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

– సం॥

విలువలు

మంటేకూడా నాలో మంచి అభిరుచి వుండేది. చాలా చిన్నవయసునుంచి వివిధ రకాల సాహిత్యాన్ని నిత్యం పరిస్తుండేవాడిని. అట్లాగే చిత్రలేఖనం అంటే కూడ నాకు మొదటినుండీ ఎంతో ఇష్టం. దానిలో కూడ కృషి చేస్తూనే వచ్చాను. జీవితంలో నా ఇష్టాని కనుగుణమైనవన్నీ పొందానేగాని జీవితంలో ముఖ్యమైన ఆనందాన్ని మనశ్శాంతిని మీ తాతగారి పట్టుదలకు లొంగి అనాలోచితంగా బలి చేసుకొన్నానని తెలిసేటప్పటికే పరిస్థితి చెయ్యిదాటిపోయింది.

కాలేజీ రోజులలో వసంతంటే నా మనసులో అంతులేని ఇష్టం ఏర్పడింది. వసంత రూపం, వసంత తలపులకు నా గుండె విపరీతంగా స్పందించేది. ఇద్దరం ఒకరు లేకుండా ఇంకొకరు బ్రతకలేమని తెలుసుకొని జీవితాన్ని కలసి పంచుకోవాలని నిర్ణయించుకొన్నాము. మీ తాతగారి దృష్టిలో వసంత సంఘంలో తక్కువ స్థాయిలో వున్న వ్యక్తి. ఈ కారణంగా వసంతను కోడలిగా అంగీకరించటానికి మీ తాతగారు సుతరామూ ఒప్పుకోక వారి పట్టుదలకు మా జీవితాలను బలి చేశారు. ఆ లేత వయసులో భవిష్యత్ జీవితంలో నాకు కావలసిందేమిటో తెలుసుకొనే లోపునే నేను వసంతను పోగొట్టుకోవటం, మీ అమ్మ నా జీవితంలో ప్రవేశించటం జరిగిపోయింది.

మేడలు, కార్లు, సంఘంలో హోదా ఇవే మీ అమ్మ దృష్టిలో జీవితమంటే! డబ్బు, నగలు, చీరలు, తనను అనుక్షణం భట్రాజుల్లా పొగుడుతుండే స్నేహితులు, క్లబ్బులు, సినిమాలు, సరదాలు ఇవే మీ అమ్మ దృష్టిలో జీవిత విలువలంటే. మనుషుల మధ్య వీటన్నింటిని మించిన విలువలు వుంటాయన్నది మీ అమ్మకు ఎప్పటికీ స్ఫురణకు రాని విషయం. జీవితంలో నిజమైన ఆనందం అంటే ఏమిటో తెలియని మీ అమ్మ ఇటువంటి కృత్రిమపు ఆనందానికి అలవాటుపడి ఆ వ్యామోహానికి లొంగి తెల్లారి లేస్తే వాటివెంట పరుగులు పెడుతుంటుంది. కట్టుకొన్నవాడికి భార్యగా ఆదరణను, ఆప్యాయతను అందివ్వాలనే స్పృహ మీ అమ్మలో ఏ కోశానా లేదు. నా నిత్యజీవితావసరాలన్నింటికీ ఇన్ని సంవత్సరాలుగా నౌకర్లమీదే ఆధారపడుతూ వచ్చాను. మీరు పుట్టింతర్వాత మీ పట్ల కూడ మీ అమ్మ తన బాధ్యతలను నెరవేర్చలేదు. అందుకే మొదటిసారిగా నీవు పుట్టినప్పుడు నాలోని పితృవాత్సల్యంతో నీవు అనాదరణకు గురి కాకూడదనే నిన్ను నాకు దగ్గరగా పెంచాను.

ఆత్మీయత, అనురాగము అనే పదాలు మీ అమ్మ దృష్టిలో ఎందుకు కొరగానివి. జీవితాన్ని అంతవరకూ అనుభవించటమే ఆమె ధ్యేయం. నా కోసం మీ అమ్మ తన ప్రవర్తనను ఎన్నటికి మార్చుకోలేదు. నేను నా జీవిత విధానాన్ని వదులుకొని కృత్రిమమయిన విలువల కోసం పరుగులు పెట్టే స్వభావం నాలోలేదు. ఈ విధంగా మా జీవితమార్గాలు వేరు పడిపోయాయి. ఇవి ఎన్నటికి కలిసే ఆశ లేదని నాకు క్రమక్రమంగా అర్థమైంది.

ఆత్మీయత కరువై యాంత్రికంగా నిర్జీవంగా రోజులు దొర్లిస్తున్నానా బ్రతుకులో తిరిగి ఒకనాడు హఠాత్తుగా వసంత ప్రవేశించింది. ఈ వూరులోనే కాక తాళీయంగా వసంత నాకు తారస పడ్డది. తన తండ్రి చనిపోవటంతో కుటుంబ భారమంతా తన మీద పడటం, తన రెక్కల కష్టం మీదే చెల్లెళ్ళను చదివించి వివాహం చేశానని, తాను మాత్రం నా స్మృతులలో జీవిస్తూ అవివాహితగానే మిగిలి పోయానని వసంత చెబుతున్నపుడు నేను జీవితంలో పోగొట్టుకొన్నది ఎంతటి విలువైనదో నా కర్థమైంది.

నా ఆనందాన్ని, సంతోషాన్ని ఎవరి దగ్గరయితే వదలి ఇన్నాళ్ళూ జీవచ్ఛవంలా బ్రతికానో వారు నాకు కలిగించే మనశ్శాంతి నా చుట్టూ వున్న ఈ సంపద నుంచి కొన్ని క్షణాలు కూడ నేను పొందలేక పోయానని తెలుసుకొన్నాను.

నన్నభిమానిస్తూ, నా కోసం జీవించే వ్యక్తి కోసం అలమటించి పోతున్న నేను వసంత చూపే అనురాగానికి, ఆదరణకు తిరిగి వూపిరి పోసుకుని వసంత సహచర్యంలో ఆనందాన్ని వెతుక్కోటం మొదలెట్టాను. రోజు మొత్తంలో వసంతతో గడిపే ఆ క్షణాలే నేను నిజంగా జీవించే క్షణాలు. నానుంచి భౌతికమైన సంపదలనేవీ వసంత ఆశించటంలేదు. ఈ జీవితంలో మిగిలిన ఈ సమయాన్నైనా నా సాన్నిధ్యంలో గడపాలని వసంత కోరుకొంటోంది. అందుకే సంఘం కోసం వెరచి జీవిత చరమాంకంలో దక్కిన ఈ కొద్దిపాటి ఆనందాన్ని పోగొట్టుకోటం నా కిష్టం లేదు.

నీకు వయసు వస్తున్నది. ఈ విషయాన్ని నీవు ఎవరినోటివెంటో విని దురభిప్రాయం ఏర్పరచుకొనే కన్నా నా నుంచి వినాలనే వుద్దేశ్యంతోనే నీకు ఈ విషయాలు చెప్పాను. తాత గారి చాదస్తం వల్లనే నా జీవితం పాడైంది. తిరిగి నేను అటువంటి పొరపాటు చేయను. మనుషులను కుల గోత్రాలు, సంపద, హోదా ముసుగులలోంచి నేను చూడనని నీకు తెలుసు. నా దృష్టిలో మనుషులకు మానవత్వానికి వున్న విలువ జీవితంలో మరి వేటికీ లేదు. మనిషి కోసం మనిషి బ్రతకటంలోనే నిజమైన ఆనందం వుంది. రాధ లేకుండా నీవు జీవించలేవని, రాధతోనే నీ ఆనందం ముడిపడివుందని నీవు నమ్మితే నా కభ్యంతరం ఏమీ లేదు. కానీ జీవితంలో స్థిరపడే దాకా మీ వివాహాన్ని వాయిదా వేస్తే అప్పటివరకు మీరిద్దరూ ఇంకా ఎక్కువగా ఒకరి నొకరు తెలుసుకోటానికి అవకాశం వుంటుంది. ఆలోచించు" చెప్పటం ఆపి మధు వంక చూచారు రావుగారు.

తండ్రి మాటలు వింటూ ఇన్ని సంవత్సరాలుగా తండ్రి పోగొట్టుకున్నదేమిటో, దాని నుంచి తండ్రి ఎంతటి ఆవేదనకు గురి అయ్యాడో మధు గ్రహించాడు. తండ్రిపట్ల సానుభూతితో హృదయం బరువెక్కగా–

"థాంక్సు నాన్నగారు. రాధను మీరు కోడలిగా అంగీకరించినందుకు నాకు చాలా సంతోషంగావుంది. వివాహం మీరు చెప్పినట్లే జరుగుతుంది" మెల్లగా తండ్రికి సమాధానం చెప్పి గదినుంచి బయటపడ్డాడు మధు. తండ్రి ప్రవర్తనపట్ల కలిగిన సందేహం తొలగిపోగా ఇనుమడించిన గౌరవాభిమానాలతో మధు మానసం తేలికపడి మనసులోనే మరొక్కసారి తండ్రికి కృతజ్ఞతలు చెప్పుకొన్నాడు. ★